

# నాటుమొక్క

'ధనుస్సు'

అతను ఇరవై ఆరు సంవత్సరాల యువకుడు, బ్రహ్మచారి.

అతను ఆ ఊరికి వచ్చి రెండు నెల్లు దాటింది. ఊరిచివరగా ఉన్న ఓ ఇంట్లో అద్దెకుంటున్నాడు. అతని గురించి ఆ వూరిలోని వారందరికీ తెలియకపోయినా, కనీసం చుట్టుప్రక్కల 'నైబర్స్' అనే వారికి గూడా అతని గురించి అంతగా తెలియదు.

మనిషి ఛామనఛాయలో కోలగా, బక్కగా ఉంటాడు. గెడకొయ్యను తప్పక గుర్తింపజేస్తాడు చూచినవారికి. అతని శరీరానికి తగ్గట్టుగానే ఆ కళ్ళూ, ముక్కుతీరూనూ. వయసు ఇరవయ్యారైనా, అంత వయసు అగుపించదు.

ముభావంగా, ముక్కుకు సూటిగా పోయే మనిషి.

అతను ఆ ప్రక్కఊరి టీచరు. అక్కడ ఉండటానికి ఇల్లు దొరక్క, ఇక్కడకొచ్చి ఉంటున్నాడు. రెండు ఊళ్ళూ దగ్గరదగ్గరగా వుంటాయి. పిల్లలు కొంతమంది అక్కడికి చదువుకు వెళ్తారు. ఊళ్ళ మధ్య పొలాలు, వాటి మధ్య సన్నని కాలిబాట తప్ప మరెటు వంటి విశేషము లేదు.

ఉదయం తొమ్మిది కాగానే స్కూలుకెళ్తాడు. ఆ వెళ్ళటంలో ఓ ప్రత్యేకత వుంది. చేతిలో ఓ రిజిస్టరు, ఓ బుక్కు పట్టుకుని, వంచిన తల ఎత్తకుండా గబగబ నడిచి వెళ్తాడు. దాన్ని ఓ పరుగులాంటి నడక అనవచ్చు. అతని కెలా వుంటుందో కాని, చూచినవారి కది వింతగా, విచిత్రంగా వుంటుంది. అయినా ఏదో చురుకుతనం అతనిలో కన్పిస్తుంది.

అతని చేతిలో ఎప్పుడూ ఏదో ఒక పుస్తకం వుంటుంది. బహుశా అదే అత

నికి బంధువు, స్నేహితురాలు, సహచ రుడు అయివుండాలి.

అతని పనేమిటో, అతని నడవ డేమిటో అతనికి తప్ప మరెవరికీ తెలియ కుండి ఉండాలి. అతనలా తన జీవి తాన్ని సాగిస్తూనే వున్నాడు. కాలం అతనికంటే వేగంగా ముందుకు పరు గిడుతూనే వుంది. ఏది ఆగినా కాలం నిలువదు కదా!—

ప్రకృతి సహజంగా వానాకాలం రానే వచ్చింది.

పాపం! దానికి మాత్రం తెలియదూ? ... మార్గశిరపు ఎండలకు సొమ్మసిల్లి మోడువారిన వృక్షజాలాన్ని ఆదుకోవా లని, వాటిని మళ్ళీ చిగురింప జెయ్యా లని!!

అందుకే, మోడు వారిన చెట్లు, పూల మొక్కలు ఆనందంతో కూడిన పచ్చ దనంతో చిగురిస్తున్నాయి.

ఇది ఎంతో సంతోషంగా వుంద న్నట్లు, చల్లని చిరుగాలికి తలలు వింతగా ఊపుతున్నాయి. వాటి మొహాల్లో ఏదో క్రొత్తదనం సంతరించుకుంది. కానీ, ఈ వానలకు నిర్మలంగా వుండే మట్టిరోడ్లు బురదతో నిండివుంటున్నాయి. ఇక పొలాల మధ్యనున్న సన్నని ఖాళీ బాట సంగతి సరేసరి.

ఉన్నదారి అదొక్కటే కాబట్టి, ప్యాంటును పైకి మడిచి, అదే దారిన స్కూలు కెళ్తున్నాడతను. మళ్ళీ సాయంత్రం నాలుగయ్యేసరికి ఇంటికి చేరుకుంటున్నాడు.

వానాకాలంలో, పది హేను రోజు లప్పుడే హరించాయి. ఎప్పటిలాగే స్కూలు వదిలి, ఇంటికి బయల్దేరా డతను. స్కూలునుండి ఇంటికి, అతని నడకకు పావుగంట పడ్తుంది. అదే మరెవరైనా రావాలంటే ఖచ్చితంగా అర గంట పట్టాల్సిందే.

వానాకాలమైనా నడవటానికి ఇబ్బందిగా వున్నా, అతని నడకకి మాత్రం ఎటు వంటి అంతరాయమూ కలగలేదు.

వర్షం ప్రారంభమయ్యింది. సగం దూరానికి పైగా అధిగమించాడతను. వాచీ చూసుకోలేదుగానీ, అతని వాచీలో టైము 'నాలుగు పది' అయ్యింది.

వర్షం తన తీవ్ర ప్రతాపాన్ని చూపిస్తూ గొడుగు వున్నా, అతన్ని కొద్దిగా తడుపు తుంది. ఒక చేత్తో గొడుగును, మరో చేత్తో రిజిష్టరు బుక్‌ను పట్టుకుని గబ గబ వస్తున్నాడతను.

పొలాల మధ్యగుండా వస్తున్న అత నికి బాటప్రక్కగా ఒక మొక్క కన్పిం చింది. అతనా మొక్కను వెంటనే గుర్తు పట్ట గలిగాడు. అది ఓ చిన్న నాచు మొక్క.

కొంచెం నలిగిపోయి వుందది. తనకు తెల్సిన మొక్క కావటాన అతను అప్ర యత్నంగా దాన్ని తన చేతిలోకి తీసు కున్నాడు.

అతనికి ఆ మొక్క అంటే ఎంతో ఇష్టం. ఇదివరకు అత నామొక్కలను పెంచాడు. చూట్టానికి ఏదోలా ఉన్నా, అది పూచే ఎర్రని అందమైన, ముగ్ధమనోహరమైన పువ్వులంటే, దానిపై అతనికి ఎంతో ప్రేమ, ఇష్టం.

అందుకే ఆ పూవులను చూచి ఎంతో ఆనందించేవాడు. రోజూ ఓ పువ్వును తన చొక్కా కాలర్ క్రింద పెట్టుకునే వాడు, అచ్చం నెహ్రూగారు గులాబీని ధరించినట్లుగా—

ఆ గతస్మృతి ప్రేరణే ఇప్పుడతన్ని ఆ మొక్కను తీసుకునేలా చేసింది. దాని కంటిన మట్టిని ఊది, ఓ చేత్తో పట్టుకుని, వర్షాన్ని తిట్టుకుంటూ తన గది దగ్గరకు చేరాడు.

అప్పటికే అతనికంటే ముందుగా, అతని గదిముందు తడుస్తూ ఓ స్త్రీ నిలబడి ఉంది. ఆమె వయసు ఇరవై, ఇరవై రెండు లోపే ఉంటుంది. చదువుకున్నదానిలా ఉంది. ఆకారంలో సంస్కారపు జాడలు స్పష్టంగా అగుపిస్తున్నాయి. ఆమె ఎంతసేపట్నుంచి అలా నిలబడి ఉందో మరి!

ఆమెను చూచిన అతను ఒకింత ఆశ్చర్యపోయాడు. ఆమె వంచుకున్న ముఖంలోకి పరీక్షగా చూశాడు. తనకు తెల్సిన బంధువులు ఎవరూ లేకపోయినా, తన కెక్కడయినా కనిపించిందా అని?

ఆమె వదనంలో అతనికా పోలికలేవీ కన్పించలేదు. దాని స్థానంలో ఏదో దైన్యం, నిస్సహాయత, భయంతో కూడిన బెరుకుతనం స్పష్టంగా కనిపిస్తోంది. తడిసిఉన్న ఆమె శరీరాన్ని అతనిక చూడకుండా గొడుగు అడ్డంచేసుకుని, గది తలుపు తెరిచాడు. పుస్తకాలను టేబిలుపై పెట్టి, గొడుగు మడిచి వారగా పెట్టాడు.

ఆమె ఇంకా ఆ వర్షంలో తడుస్తు, అలాగే గుమ్మంలో నిలబడింది. తడిసిన ఆమె తల వెంట్రుకలు ఒక్కో నీటి బొట్టును జారవిడుస్తున్నాయి. వర్షం ఇంకా పెద్దదవుతూనే ఉంది. ఇంకా సాయంత్రం కాకపోయినా, నల్లని మబ్బుల మూలాన చీకటిపడుతున్నట్లుగా భ్రమిస్తోంది.

చివరికి అతనే చొరవతీసుకుని, "ఎవరండీ మీరు?... అభ్యంతరం లేకుంటే లోనికి రండి!" అన్నాడు.

అందుకామె, "అబ్బే, అభ్యంతరం ఏమీ లేదండి .... ఏంలేదు..." వణుకుతున్న కంఠంతో అంది. ఆమె చలికి వణుకుతూ అన్నదో, భయంవల్ల వణుకుతూ అందో అర్థంగాదు. ఆమె అలాగే ఆ వర్షంలో మాత్రం నిల్చుంది.

"ఫర్వాలేదు లోపలికి రామ్మా! వర్షం తగ్గేలా లేదు. పూర్తిగా తడిసి పోయారు కూడా!" మళ్ళీ అన్నాడతను.

ఆమె కొంచెంసేపు తటపటాయించి, అతని బలవంతంమీద లోనికి వచ్చింది. తలుపు వారగా నిల్చుంది. వర్షం

మాత్రం తగ్గటంలేదు. ధనికుడి ధనంలా అంతకంతకు పెరుగుతూనే ఉంది. మెరిసిన మెరుపు కళ్ళల్లో జొరబడి, చీకట్లు క్రమ్ముకునేలా చేస్తోంది. వానదేవుడు ఎవరిమీదనో భీకరంగా ఘర్జిస్తున్నాడు. హోరున కురుస్తున్న ఆ వర్షంలో ఎక్కడో పిడుగుపడినట్లుగా పెద్ద చప్పుడు.

ఆ పరిస్థితుల్లో ఇప్పుడామెకు లోనికి రావటం సబబే ననిపించింది. తడిసిన తన చీరపమిటను పిండింది. అయినా, తడి ఏమాత్రం ఆరలేదు.

ఆమె అలా తడిగా ఉన్నచోటల్లా పిండుకుంది. ఆ అవస్థను కనిపెట్టిన అతను ఒక పెద్ద పొడి పంచెను ఇచ్చాడు. ఆమె గదిలోకి వెళ్ళి, తన చీర మార్చుకుంది. తడిసిన చీరను పూర్తిగా పిండి ఆరవేసింది.

అతను, తను తెచ్చిన నాచుమొక్కను ఒక చిన్న కుండీలో నాటు వేశాడు. ఆమెరాక అతనిలో ఏ విధమైన భావాన్ని పొడసూపటంలేదు. పరిస్థితినంతా సాధారణంగానే తీసుకుంటున్నాడు. అతని కెటు వంటి నూతనత్వమూ గోచరించటం లేదు. కానీ, 'పాపం! ఈమె ఎవరో?' ఏం పనిమీద ఎటు వెళుతూనో ఈ వానలో ఈ గదికి చేరింది.' అని మాత్రం అనుకున్నాడు.

తర్వాత ఇద్దరికీ సరిపడ వంట చెయ్యడం మొదలుపెట్టాడు, ఆమె మాత్రం ఏమీ మాట్లాడకుండా అలాగే నిల్చుని, కుండపోతగా కురుస్తున్న వర్షంలోకి తదేకంగా చూస్తోంది. ఇక ఆమె మనసులో ఎలాటి భావాలున్నాయో మాత్రం అతనికి తెలియడంలేదు.

"అతిథిదేవోభవ" అన్న సూక్తిలోని భావాన్ని బాగా అర్థంచేసుకుని, జీర్ణించుకున్న అతను మాత్రం ఆమెకోసం అన్ని ఏర్పాట్లు చేస్తున్నాడు. చేశాడు. చీకటి మరీ పడింది. లైటు వెలిగించి. వండిన అన్నాన్ని ఆమెకింత పెట్టి, తనూ ఇంత పెట్టుకున్నాడు.

కానీ, ఆమె మొదట తిన్లేదు. వద్దంది. తనకోసం ఏ శ్రమా తీసుకోవద్దంది.

భోజనం పెట్టటం తన ధర్మమని, మీరు తిననిదే నేను తిననని అతనన్న మీదట, బలవంతాన ఆమె ఎలాగో భోజనం చేసింది. ఒక స్త్రీ పరిచయం కావటం, ఆ స్త్రీతో కల్సి భోజనం చేయటం అతని కదే మొదటి సారి.

భోజనం ఎలాగో అయిపోయింది. ఇహ ఉన్నదల్లా ఒకటే చిక్కు. పడుకోటానికి ఉన్నది ఒకటే మంచం. మీరే మంచంపై పడుకోండనంటే, మీరే పడుకోండని చివరకు ఇద్దరూ క్రిందనే పడుకున్నారు.మంచంపైపడుకోటానికి ఆమెకు అభిమానం అడ్డు వస్తే, అతనికి అతిథి మర్యాద గుర్తుకు వచ్చింది.

మంచం వీరిద్దరి ప్రవర్తన చూచి, వింతగా నవ్వుకుంది.



మంచానికి అవతలివైపు పడుకున్న ఆమె ఓ రాత్రివేళ, ఇటువైపు పడుకున్న అతని దగ్గరకు దొర్లి అతనిపై ఒక చెయ్యివేసింది. అది నిద్రలో జరిగిన పొరపాటు మాత్రమే.

మరో శరీరపు స్పర్శ తగలగానే అతను ఖంగారుపడి లేచి, ఆమెను లేపి, "ఏమండీ మీరు దూరంగా జరిగి పడుకోండి!!" అన్నాడు.

పరిస్థితి గమనించిన ఆమె ఎంతో

సిగ్గుపడింది తన ప్రవర్తనకు తానే. తర్వాత దూరంగా నేలపైనే పడుకుం దామె.

తెల్లవారింది.

ఆమె పేరూ, ఊరూ, చదువు, ఎక్కడికి ఎందుకు వెళుతున్నది అడిగాడతడామెను. ఆమె కొంచెంసేపు మౌనం వహించి; కొన్ని విషయాలు చెప్పటానికి నిరాకరించినా, తన పేరు 'కుసుమ' అని, బి.ఏ. చదివానని, ఇంకా పెళ్ళి కాలేదని, ఉద్యోగాన్వేషణలో తిరుగుతూ యాధృచ్ఛికంగా వర్షం వల్ల రావల్సి వచ్చిందని చెప్పింది.

తర్వాత తన బాధామయ జీవితం గురించి కొంతవరకు చెప్పింది. ఎలాగైనా ప్రస్తుతం తన జీవితానికి ఓ ఆదరువు లభించాలని చెప్పింది. ఆమెకూడా తనలాగే పేదకుటుంబానికి చెందినదని, బంధువుల ఆదరణ కూడా సరిగా లేదని గ్రహించాడు.

తర్వాత అతనామెతో, తనస్కూల్లో ఓ లేడీ టీచరు పోస్టు ఖాళీఉందని, దానికి అప్లై చేస్తానని, దానికి ఆమెను సెలక్టు చేస్తానని చెప్పాడు.

ఆమె సంతోషంతో సరేనంది. ఆ సంతోషం తనకో ఉపాధి లభించబోతున్నందుకో, లేక ఆ ఉపాధిని చూపిస్తున్న ఆ ఉపాధ్యాయున్ని చూస్తున్నందుకో అది ఆమెకే తెలియాలి.

అతను తను వేసిన నాచుమొక్కను చూశాడు. సూర్యకాంతి తగిలి విప్పారిన ఆకులతో ఆ మొక్క జీవంతో కళకళలాడుతుంది. దాని ఆలనా పాలనా, చూడటం, దాన్ని తన చూపులతో రోజూ పరామర్శించడం ఆ నాటినుండి మొదలయ్యిందతనికి. అతని దినచర్యలో అదొక భాగమయ్యిందంటే, ఆ మొక్కంటే అతనికెంత ఇష్టమో ఊహించవచ్చు.

టైము తొమ్మిది కావస్తోంది. వాతావరణం తెరిపి ఇచ్చింది. అతను స్కూలుకు వెళ్ళాడు. స్కూల్లో పాతికమంది అమ్మాయిలున్నారని, ఓ లేడీ టీచరు తప్పక అవసరమని ఓ అప్లికేషన్ రాసి, ఇక్కడ బి.ఏ. చదివిన ఓ స్త్రీని నిర్ణయిస్తున్నామని వ్రాశాడు జిల్లా విద్యాశాఖాధికారికి.

అతను ఇవేళ పుస్తకాల జోలికి పోలేదు. తీరిక సమయంలో అతని ఆలోచనంతా ఇపుడామెపైనే. ఒక నిరుద్యోగురాలికి సహాయం చేస్తున్నానన్న సంతృప్తి తప్ప, మరే భావమూ లేదు ఆమెపై అతనికి.

మరో వారం రోజులు గడిచాయి. ఇప్పుడతనికి చాలా సన్నిహితమైందామె. అతను వచ్చేసరికల్లా వంట చెయ్యటం, కాఫీ పెట్టటం, ఇంట్లో మిగతా పని చేస్తుంది. తర్వాత ఆమెను ఆ స్కూల్లోనే టీచర్‌గా వేసుకోటానికి ఆర్డర్స్ వచ్చాయి. ఆమె తన కర్తవ్య నిర్వహణలో నిమగ్నమయ్యింది. అతని,

ఆమె జీవితాలిప్పుడు సజావుగా సాగుతున్నాయి.

రోజులు యధావిధిగా దొర్లుతూనే ఉన్నాయి.

అతను వేసిన నాచుమొక్క బాగా పుంజుకుని ఒక పెద్ద మొక్కగా పరిణతి చెందుతోంది. దానిలాగే ఆమె ఇప్పుడు జీవితంలో ఒక మనిషిగా నిలబడగల్గింది. బీద కుటుంబంలో పుట్టి, చిన్నప్పుడే తల్లితండ్రులను పోగొట్టుకుని, బంధువుల ఆదరణవల్ల చదువుకొన్న ఆమె బ్రతుక్కి ఒక సార్థకత లభించినట్లయ్యింది. ఆమె వంటరి జీవితానికి ఓ దారి కన్పించింది.

ఆమెకిక కావల్సింది ఒక తోడూ, నీడ మాత్రమే. ఈ రెండూ ప్రతి మనిషికి తప్పక అవసరమే. ఇప్పుడవి ఆమెకుకూడా ఎంతో అవసరం. ఆ నెల వచ్చిన జీతం డబ్బులోనుంచి సగం తిండి ఖర్చుకు, ఇంటి అద్దెకుగాను అతని కిచ్చిందామె.

ఆ ఒక్క యింటిలోనే వారిద్దరు మరో నెల గడిపారు.

వానాకాలం పోయింది. పుచ్చపువ్వులాంటి శరదృతువు చంద్రుని వెన్నెల భువిపై పెల్లగా పరుచుకుంటూ, చలి కాలానికి స్వాగతం పలుకుతుంది. పగలంతా మబ్బులు లేని ఎండ చక్కగా కాస్తోంది.

ఆవాళ ఆదివారం. బడికి శెలవు కాబట్టి, ఇద్దరూ ఇంటిదగ్గరే ఉన్నారు. అతను ఎప్పటిలాగే తన నాచుమొక్క దగ్గరికి వెళ్ళాడు. అది ఎండకు తాళలేనట్టుగా ఆకులు వడలిపోయి ఉంది. వెంటనే దాన్ని ఎండ తగలని నీడన పెట్టాడు. ఇన్నినాళ్ళనుండి అతను దానిపై చూపిస్తున్న అమితమైన శ్రద్ధను గమనిస్తూనే ఉంది ఆమె. పూల మొక్కలపై అతనికున్న శ్రద్ధకు ఎంతో ముచ్చటపడింది కూడా.

కానీ, తనకూ అలాంటి ఆదరణ లభిస్తే, అది అతనినుండే సహచరునిగా లభిస్తే ఎంతో బావుణ్ణనిపించిందామెకు. అతని గురించి ఏదో అడిగి తెల్సుకోవాలనుకుంది. వెంటనే అడగలేక పోయింది. సిగ్గుపడి తనలో తానే నవ్వుకుంది చిన్నగా.

అది అతని స్వవిషయమైనా, ఒక నాడు ధైర్యంచేసి అడగనే అడిగింది. "ఏమండీ! మీరు మారేజెందుకు చేసుకోలేదు!" అని. అతను ఓ క్షణం తడబడి, ఏదో చెప్పబోయి, "ఆ.... నేనా!," అని, "మరి మీ రెందుకు చేసుకోలేదు." అన్నాడు.

ఎందుకు చేసుకోలేదో తనకు తెల్సినా, గబుక్కున అనలేకపోయింది. కానీ, ఆమె మాత్రం ఏదో తెగింపుతో కూడిన ధైర్యంతో, "మీలాంటి మంచివారు కన్పించక. చూడండి! నేను మిమ్మల్ని ప్రేమిస్తున్నాను. మీ కభ్యం

తరం లేకపోతే,—మీ కిష్టమైనపక్షంలో పెళ్ళికి నేను సిద్ధమే. ఒక ఆడదాన్ని, మీ ఔన్నత్యానికి తగనిదాన్ని మీతో ఇలా అంటున్నందుకు నన్ను క్షమించండి." అన్నదామె. అంటున్నంత సేపు గుండె వేగం పెరిగి భయంభయంగానే ఉంది.

అతను ఏమీ మాట్లాడలేదు. వింటున్నంత సేపూ, విన్నకొద్దినిమిషాల వరకు. కొద్ది సేపు ఆవిషయం గురించి తీవ్రంగా ఆలోచించాడు. చివరకు ఒక నిర్ణయాని కొచ్చాడు. ఆ నిర్ణయాన్ని అమలుపర్చాలనుకున్నాడు. అతనికీ ఒక సహచరిణి కావాలనే ఉంది.

తర్వాత వారిద్దరూ, ఒకరి జీవితంలో మరొకరు ప్రవేశించారు. తమ రెండు వేరు జీవితాలను ఒక్కటి చేసుకున్నారు. వారిద్దరి మనసులు ఏకమైనాయి. అతను తన బ్రహ్మచర్యానికి స్వస్తివచనాలు పలికాడు.

అతనికి జీవితంలో నవవసంతం ప్రవేశించిన ట్లనిపించింది. ఇప్పుడామె ప్రేమ, అనురాగం అతని సొత్తు. అతని ఆదరణ, ఆప్యాయత ఆమె సొత్తు. జీవితంలోని మధురమైన క్షణాల్ని వారిద్దరు అనుభవించారు.

ప్రవేశించిన చలికాలం వారి బంధాన్ని మరింత దగ్గరకు చేర్చింది.

రోజులు నిమిషాల్లా గడిచిపోతున్నాయి వారిద్దరికి. వారి అనురాగంలాగే, పెరుగుతున్న నాచుమొక్క చిన్న మొగ్గతొడిగింది. అసలే ఆనందంలో మునిగిఉన్న అతను అది చూచి, మరింత సంతోషంతో ఉప్పొంగిపోయాడు. దానికి తోడు 'తను పెంచిన మొక్క మొగ్గతొడిగింది కథా' అన్న తృప్తికూడా ఉంది.

ఆ మొగ్గ రోజురోజుకు పెరిగి, పెద్ద దవుతోంది. ఎలా అంటే?, బలీయంగా, బాధ్యతాయుతంగా పెరుగుతున్న వారి అనురాగంలాగే.

మర్నాడు ఆ మొగ్గ విరిసి పువ్వుగా మారింది. మరికొన్ని చిన్న మొగ్గలను కూడా వేసింది. అతని ముఖం, మనస్సు సంతోషంతో మరింత విప్పారింది.

అతని జీవితంలో ప్రధాన విషయాలు-ముఖ్యంగా రెండే రెండు. ఒకటి, ఆ నాచు మొక్క. రెండు, ఆమె సహచర్యం. ఆమె ఎంతో, అతనికి ఇదీ అంతే.

ఆ రెండూ అతని ఇంట్లోకి, జీవితంలోనికి ఒకేసారి ప్రవేశించడంవల్ల ఆ మొక్కకు, ఆమెకూ ఏదో సారూప్యం కనిపిస్తుంది. కానీ ఆ విషయం మాత్రం అతను గమనించలేదు.

అతనామెను స్వంతంచేసుకుంటున్నట్లే, ఆ పువ్వును త్రెంచి, ముద్దు పెట్టుకుని, తన గుండెపై నింపుగా, అందంగా అలంకరించుకున్నాడు. అప్పుడతని శరీరం పులకరించింది.

అసలు ఆ మొదటి పువ్వును కోయ వద్దనుకున్నాడు. కానీ, అంతకంటే

బలీయమైన కోర్కె ఆ ఆలోచనను నెట్టివేసింది.

ఆ పువ్వును ధరించి ఆమెను చేరా డతను. ఆ పువ్వుతో ఉన్న అతన్ని చూచి ఎంతో ఆనందించిందామె. ఆ సమ యంలో ఆమెకు అతని పువ్వులాంటి సుకుమారమైన, మనోహరమైన మంచి తనం గుర్తుకు రావటమే ఆ ఆనందానికి కారణం.

అందుకు ఆ ఆనందంలో అతన్ని ముద్దులతో ముంచెత్తింది.

రోజూ ఆ నాచుమొక్క మొగ్గలు తొడిగి పువ్వులు పూస్తూనే ఉంది. ఆ పువ్వు అతని గుండెలమీదికి చేరి నలిగి పోతూనే ఉంది.

పువ్వులాంటి అందమైన, కోమల మైన ఆమె అతనికి మరెంతో ప్రియం అయ్యింది.

ప్రేమ లాంటి అనుబంధం లాంటి అనురాగం వారిద్దరి నడుమ వారధిగా నిల్చింది.

ఆ అనుబంధం, కలయిక ఏనాటిదో మరి! బహుశా అది ఆ విధికే తెలియాలి.

రెండు నిమిషాల్లాగ గడిచిన వారి జీవితంలో, వారి ప్రణయ ప్రయాణంలో అనుకోని, కనీసం ఊహించని సంఘ టనే అతన్ని ఎంతో వ్యధతో కూడిన నరకయాతనకు గురించేసింది. అతన్ని జీవశ్చవంలా మార్చింది.

ఎప్పటిలాగే ఆమె స్కూల్లోని విద్యార్థినులకు పాఠం చెబుతోంది. అనుకోని విధంగా ఆమె గుండె ఏదో బాధకు లోనయ్యింది. ఆమె శరీరం వణుకుతోంది. ఆమె ముఖంలో ఆ బాధ తాలూకు భయాందోళనలు స్పష్టంగా కనిపిస్తున్నాయి.

ఆ తెలియని బాధకు ఆమె ఇక నిలవ లేకపోయింది. గుండెలో నొప్పి అధికం అయింది. ఆమె శరీరం ముచ్చెమటలలో మునిగివుంది. ఈ హఠాత్పరిమాణాన్ని చూచిన అతను ఆమెను పొదివి పట్టుకుని, బెంచి పై పడుకోబెట్టాడు.

కబురందిన ఆ వూరిన ఉన్న ఓ చిన్న డాక్టరు వచ్చి, అది గుండెపోటని నిర్ధారణ చేసి, ఏవో కొన్ని మాత్రలిచ్చి వెళ్ళాడు. టాబ్లెట్ మింగిన ఆమెకు కొంత సేపటికి కొంత ఉపశమనం కల్గింది. తర్వాత ఎలాగో ఇద్దరూ ఇల్లు చేరారు. ఆమె నీరసంగా మంచం పై వాలిపోయింది. ఆమె ముఖ కమలం భయంతో కూడిన గుబులుతో ముడుచుకు పోయింది.

అంతకన్నా ఎక్కువ ఆరాటం, ఆతృత, ఏమౌతుందోనన్న తొందర అతనిలో చోటుచేసుకుంది. తర్వాత నాచుమొక్కను చేరాడు. ఎందుకో అదీ వాడినట్లుగా అగుపిస్తోంది. దానిబాధేమిటో చూస్తున్న అతనికి మాత్రం అర్థంగా లేదు. మొగ్గలు, ఆకులు తలలు వంచాయి.

పాపం! అదీ ఓ బాధకు గురయిందని, అతనికి తట్టుకపోవటం విచారకరం. మర్నాడు ఉదయం అన్ని పనులు అతనే చేశాడు. ఆమెకు కాఫీ కాచి ఇచ్చాడు. ఆమె మాత్ర వేసుకుని త్రాగింది. కానీ, ఆమెలో కనీసం నిన్నటి ఆరోగ్యం కూడా లేదు. పూర్తిగా నీరసించింది. కళ్ళలో మెరుపు లేదు.

అయినా ఆమెను వదిలి స్కూలుకు వెళ్ళక తప్పలేదు. పిల్లలకు అరునెలల పరీక్షలు దగ్గర పడటంవల్ల, ఉద్యోగ నిర్వహణను అతను విస్మరించలేక ఆమెను విడిచివెళ్ళాడు.

అయినా అతని మనస్సంతా ఆమె పైనే. తన టీచర్ పోస్టులో పిల్లలకు పరధ్యాన్నంగా పాఠం పొరపాటు చెప్పడం అదే మొదటిరోజు. బరువుగా, బాధగా క్లాసు గడిచింది.

ఆమె కెలా ఉందోనన్న ఆతృత, ఆందోళనతో ఇల్లును చేరాడతను.

రాగానే పూవులతో కళకళలాడుతూ అగుపించాలని, ఇంటికి అలంకారంగా ఉండాలని ఇంటిగుమ్మంలో కుండీలో ఉంచిన నాచుమొక్క పూర్తిగా వాడి కుండీ అంచుమీదుగా జారిఉంది. చెట్టు నిండా పూయవల్సిన మొగ్గలు ఎన్నో ఉన్నాయి. అది నిర్జీవమైఉంది.

దాన్ని చూచిన అతను ఒక్కసారిగా నిర్ఘాంతపోయాడు. అతని గుండె వేగం మరింత హెచ్చింది. తేరుకుని అతను మొక్కను పీకి చూచాడు. దాని వ్రేళ్ళను పూర్తిగా ఏదో పురుగు తినేసింది. అతని మనస్సు దుఃఖంతో పూడుకుపోయింది. కళ్ళు తమ వంతు నీళ్ళను బుగ్గలమీదికి జార్చాయి.

అతని హృదయం మూగరోదనతో, వేదనతో అరిచింది.

ఇంతలో ఏదో గుర్తొచ్చినవాడిలా దగ్గరగా వేసిఉన్న తలుపుతీశాడు.

ఒక్కసారిగా కుప్పకూలిపోయాడు అతను.

అతని బుగ్గలమీది నీళ్ళు మంచుల గడ్డకట్టి నిలిచాయి.

ఆమె ఈ లోకంనుండి శాశ్వతంగా పూర్తి విశ్రాంతి తీసుకుని ప్రశాంతంగా నిశ్చలంగా పడుకుని ఉంది, ఆ నాచ మొక్కలాగ.

